

హంతకులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిపిఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి మూకను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐద్వా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఐద్వా జిల్లా కన్వీనర్ ఎం.భాగ్యమ్మ మాట్లాడుతూ పెంచలయ్యను హత్యచేసిన వారందరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రోజురోజుకు సమాజంలో హింస పెరిగిపోతోందన్నారు. యువతను గంజాయి, మత్తు పదార్థాలు గురించి జాగృతి చేస్తున్నాడనే పెంచలయ్యను పిల్లల ముందే నరికి చంపడం చాలా విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తు వలన పిల్లలు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, దీనివలన యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ కార్యదర్శి రెడ్డి ప్రసన్న మాట్లాడుతూ పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో షాహినా, జానకి, అంజలి, నసీమ పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- డిడిఒ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి కృషి చేస్తుందని రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి రూరల్ మండలంలోని చెన్నముక్కపల్లె గ్రామంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్తూరు జిల్లా నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 77 డిడిఒలు ప్రారంభించారన్నారు. ప్రజలకు సంబంధించినందుకు డిడిఒ కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి మండల టిడిపి అధ్యక్షుడు గండికోట సుధాకర్, టిడిపి నేత కొండారెడ్డి, డిడిఒ లక్ష్మీపతి, ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి, డిప్యూటీ ఎంపిడిఒ సురేష్ బాబు, మదుసూదన్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిడిఒతో పిఆర్ వ్యవస్థ మరింత బలోపేతం : కలెక్టర్

రాజంపేట : జిల్లాలోని ప్రతి డివిజన్ డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. రాజంపేటలోని బోయినపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన డిడిఒ కార్యాలయాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1973లో ప్రారంభమైన పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామాలు, మండలాల అభివృద్ధికి కీలక పాత్ర పోషించిందని, ఈ



డిడిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అభివృద్ధిలో ఎంపిడిఒల పాత్ర ఎంతో కీలకమన్నారు. డిడిఒ కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకొచ్చిన ఈ వ్యవస్థీకృత మార్పుతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో డిపిఒ రాధమ్మ, తహశీల్దారు పీర్మున్ని, ఎంపిడిఒ వరప్రసాద్, డివిజన్‌లోని మండలాల ఎంపిడిఒలు, టిడిపి మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పంచాయతీ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయడానికే డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. సిఎల్ఆర్‌సి భవనంలో డిడిఒ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తాజ్ మస్రూర్, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ కుమార్ చౌదరి, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటరమణ పాల్గొన్నారు.

చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-పుల్లంపేట

వర్షాకాలం కావడంతో చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం మండలంలోని పుల్లంపేట చెరువు, దానికి సంబంధించిన ఆనకట్టలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుల్లంపేట చెరువులోకి నీరు రావడానికి జరుగుతున్న పనుల గురించి ఇరిగేషన్ ఎఇఇ నాగేంద్ర నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పుల్లంపేట చెరువుకి నీరు రావాలంటే గారాలమడుగు ఊరి దగ్గర ఉన్న అప్పారాజుపేట ఆనకట్ట దగ్గర నుండి పుల్లంపేట చెరువు వరకు కాలువ సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు ఉన్నదని ఈ కాలువ అక్కడక్కడ పూడిపోయి ఉన్న కారణంగా ఆ పూడికను తీసే పనులు జరుగుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. వాగులు, వంకలు క్రాస్ అయ్యే దగ్గర, రోడ్డు క్రాస్ అయ్యే దగ్గర స్ట్రక్చర్స్ పనుల గురించి నివేదికను సమర్పించాలని నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని ఏ చెరువుకైనా నీరు వచ్చే మార్గాలు ఉంటే వాటిని పరిశీలించి అతి తక్కువ ధరలో వాటిని పునర్నిర్మాణం చేసి చెరువులను నింపవలసిందిగా అధికారులను ఆదేశించారు. పుల్లంగేరు, పుల్లంగేరుపైన ఉన్న అన్ని ఆనకట్ల, చెరువుల గురించి, గొలుసుకట్టు చెరువులకు సంబంధించిన వివరాలు ఎఇఇ నాగేంద్ర నాయక్ కలెక్టర్‌కు వివరించారు. గొలుసుకట్టు చెరువులలో భాగంగా నూకనపల్లి ఆనికట్ట వద్ద ఉన్న కాలువ ద్వారా రాతి చెరువు, అనంత సముద్రం పెద్ద చెరువు, అనంత సముద్రం చిన్న చెరువు, వత్తలూరు చెరువు, ఆంజనేయ స్వామి బుగ్గ తర్వాత ఊట్కూరు చెరువుకు పుల్లంగేరు నీరు సరఫరా కావడం జరుగుతుందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, పుల్లంపేట మండలం తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపిడిఒ ఎఒ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, టిడిపి అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, మాజీ మండలాధ్యక్షులు ఆరే సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.



పుల్లంగేరును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిని అభివృద్ధి చేస్తాం : మంత్రి



ప్రజలతో కలిసి ర్యాలీగా వస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి -రాయచోటి

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగిస్తామంటూ ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని రాయచోటి జిల్లా కేంద్రాన్ని రాష్ట్రంలో అన్ని జిల్లాలకు ధీటుగా అభివృద్ధి చేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగిస్తూ ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేయడాన్ని హర్షిస్తూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రయివేట్ విద్యాసంస్థల జెఎసి ఆధ్వర్యంలో 'థాంక్యూ సీఎం సార్' అంటూ భారీ ఎత్తున ర్యాలీ, కృతజ్ఞతాభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. టిడిపి కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు, వ్యాపార వర్గాలతో కలిసి కేక్ కట్ చేశారు. చెక్ పోస్ట్ శివాలయం వద్ద నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతాభినందన సభలో మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో అన్నమయ్య జిల్లాను అన్ని జిల్లాలకు ధీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా కేంద్రానికి రాయచోటి అనువైన ప్రాంతమని, నీటి సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. జిల్లా ఏర్పాటు కోసం సహకరించిన మంత్రివర్గ ఉప సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సహకారంతో రానున్న మూడున్నర సంవత్సరంలో జిల్లా కేంద్రమైన రాయచోటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పట్టణంలోని పలు విద్యా సంస్థల అధినేతలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకం : డిఇఒ



మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

విద్యాభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకమైందని జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని డిఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతుందని తెలిపారు. హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించిన సంఘంగా యుటిఎఫ్ రాణిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించడం ఒక్క యుటిఎఫ్‌కే మాత్రమే సాధ్యమన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేం దుకు యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రతి ఏడాది నిష్ణాతు లైన ఉపాధ్యాయులు, అధ్యాప కులచే మోడల్ ప్రశ్నాపత్రాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మోడల్ పేపర్స్ కావాలసినవారు 9440181800, 9849534690 నంబర్లతో పాటు ఆయా ప్రాంతాలలోని యుటిఎఫ్ నాయకత్వాన్ని సంప్రదిం చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి జిల్లా కార్యదర్శి దావూద్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, అమీన్, రఫీక్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఇమ్రాన్ పాల్గొన్నారు.



గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేసిన పోలీసులు

కోర్టు అనుమతితో గ్లోబల్ ఆస్పత్రి సీజ్ : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ దందా కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మదనపల్లె కేంద్రంగా గ్లోబల్ ఆస్పత్రిలో నిర్వహించిన కిడ్నీ రాకెట్ కేసులో ఇప్పటికే అన్నమయ్య జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు, డయాలసిస్ టెక్నీషియన్స్ మెహరాజ్, బాలరంగడు, వైజాగ్‌కు చెందిన పిళ్లి పద్మ, సత్య, సూరిబాబు, కడపకు చెందిన ఓటి అసిస్టెంట్లు కొండయ్య, సుమన్‌లను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కిడ్నీ రాకెట్ దందాకు కేంద్రంగా నిలిచిన గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేసేందుకు పోలీసులు కోర్టు అనుమతి కోరారు. కోర్టు నుంచి అనుమతి రావడంతో గురువారం డిఎస్‌పి మహేంద్ర, సిఐలు మహ్మద్ రఫీ, రాజారెడ్డి, ఎస్ఐ రహీమ్, టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ వెళ్లి గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ గ్లోబల్ ఆస్పత్రిలో చట్ట విరుద్ధంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగడంతో వైజాగ్‌కు చెందిన యమున అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. ఈ కేసులో ఇప్పటికే 8 మందిని అరెస్టు చేశామని, సర్జరీ చేసిన బెంగుళూరుకు చెందిన డాక్టర్ అనంద్ పార్థసారథి పరారీలో ఉండడంతో గాలింపు చేపట్టామన్నారు. గ్లోబల్ ఆస్పత్రిలో సర్జరీకి ఉపయోగించిన పరికరాలను, ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశామన్నారు. ఈ కేసులో సంబంధం ఉన్న ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అన్ని కోణాల్లో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

20, 21న బాస్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-పీలేరు

భారతీయ అంబేద్కర్ సేన (బాస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక బాస్ కార్యాలయంలో గుండ్లూరు రవీంద్ర అధ్యక్షతన జరిగిన బాస్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఈ నెల 20, 21వ తేదీన జరిగే బాస్ రాష్ట్ర మహాసభలకు బాస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలకు బాస్ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ఎర్రబల్లి మల్లికార్జున, గుండ్లూరు రవీంద్ర, దప్పేపల్లి ఆనంద్ కుమార్, పల్లె పోగు హరినాథ్, జనార్ధన్, రాజేంద్ర నాయక్, సురేష్ నాయక్, బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- వాల్మీకిపురం

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై గ్రామీణ ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని జులేఖ బేగం అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తిలో జరుగుతున్న వారపు సంతలో ప్రజలకు స్క్రబ్ టైపస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అనేది ఒక చిగ్గర్ అనే చిన్న పురుగు కాటు వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ అని, ఇది సాధారణంగా పొలాలు, గడ్డి, పొదలు, పశువుల వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఐదు రోజుల కంటే ఎక్కువగా జ్వరం ఉండడం, శరీరంపై నల్ల మచ్చలు ఏర్పడడం, తలనొప్పి, శరీర నొప్పులు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, బలహీనత తదితర లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సిహెచ్ఒ అరుణ, సూపర్వైజర్ భానుబి సిబ్బంది హృదయిస్వరి, స్వరూప, రమణమ్మ, అనురాధ, పార్వతి పాల్గొన్నారు

రాయచోటి అర్బన్ : స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదని డిఎంహెచ్ఒ లక్ష్మీనరసయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెంద వలసిన పని లేదని, ప్రస్తుతం మన జిల్లా పరిధిలో ఇప్పటికి 289 నమూనాలు సేకరించామని ఇందులో కేవలం ఇప్పటికి 39 పాజిటివ్ కేసులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ వ్యాధి తీవ్రమైనది కాదని ఇందుకు సంబందించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.



సంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రక్షణ కల్పించండి : వృద్ధ దంపతులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం కోడలు, మనవరాళ్లు వేధింపులకు గురిచేస్తున్నారని వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మ అవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుంతపల్లివంకకు చెందిన తమకు ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. కుమారుడు సుధాకర్ చనిపోయాడని, సురేష్ కుమార్‌కు భార్య మంజుల, ముగ్గురు కుమార్తెలు మానస, పావని నవ్యశ్రీ ఉన్నారన్నారు. ఏడాది క్రితం సురేష్ కుమార్ మృతి చెందాడన్నారు. అప్పటినుంచి కోడలు మంజుల, మనవరాళ్లు మానస, పావని నవ్యశ్రీ తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం పాకులాడుతున్నారే తప్ప మాబాగోగులు చూడడం లేదని కన్నీటిపర్యం తమయ్యారు. ఆస్తులు రాసిచ్చేయాలని తమను వేధింపులకు గురిచేస్తూ అవమాన పరుస్తున్నారన్నారు. నీరుగట్టువారిపల్లిలో ఉన్న మా సొంత ఇంటిలో నుంచి తమను గెంటేయడంతో గ్రామానికి వెళ్లిపో యామన్నారు. ఈ వయసులో వారి వేధింపులు భరించలేక పోతున్నామని, ఇలాగే వేధింపులకు పాల్పడితే మాకున్న 7 ఎకరాల పొలం, ఇండ్లను అనాథశరణానికి రాసిచ్చేసి మేము కూడా అక్కడికే వెళ్లిపోతామని తెలిపారు. అధికారులు స్పందించి రక్షణ కల్పించాలన్నారు.

ఆంక్షలు విధించడం బాధాకరం : ఆకేపాటి

ప్రజాశక్తి-రాజంపేట: తిరుమల మహా పాదయాత్రకు ఆంక్షలు విధించడం బాధాకరమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆకేపాటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం అధికా రంలో ఉన్నా వందలాదిమంది భక్తులతో అన్నమయ్య నడిచిన మార్గం ద్వారా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వాముల వారిని దర్శించుకుంటున్నామని పేర్కొన్నారు. అప్పటి నుంచి లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. కాలిబాటలో అటవీ, పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆంక్షలతో భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసి మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఆనంద్

ప్రజాశక్తి-మదనపల్లె: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుర్లు ఆనంద్ యాదవ్ గురువారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్రంలోని సామాజిక వర్గాల సంక్షేమం, సంఘాల అభివృద్ధి, యాదవ సమాజానికి సంబంధించిన వివిధ సమస్యలపై జగన్ మోహన్‌రెడ్డితో చర్చించినట్లు పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాలకు అండగా, తోడుగా నిలవడం తమ పార్టీ ధ్యేయమని, శ్రేయస్సుకు కృషి చేయడం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద తనిఖీ చేస్తున్న రమణమూర్తి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

- ఐదుగురు స్టాంప్ వెండర్ల లైసెన్స్‌లు రద్దు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ప్రజల నుంచి వచ్చిన నేపథ్యంలో ఐదుగురు స్టాంపు వెండర్ల లైసెన్సులను రద్దు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ కడప డిఐజి రామలక్ష్మి పట్నాయక్ స్థానిక కార్యాలయంలో ఈ నెల 24న క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రాథమిక సమాచారాన్ని సేకరించారన్నారు. ఇవే అంశాలను రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్‌కు నివేదించారన్నారు. బాధితులు వ్యక్తిగతంగా అందజేసిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో విచారించాలని జిల్లా రిజిస్ట్రారును డిఐజి ఆదేశించారు. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్రమాలపై ఇటీవల బాధ్యతలు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఇక్కడ అక్రమాల డొంక కదిలింది. రిజిస్ట్రేషన్ రాష్ట్ర స్థాయి అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. వాటిలో ఆస్తులు క్రయ, విక్రమదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మార్కెట్ విలువలో ఒక్క శాతం లంచంగా ఇవ్వాల్సిందే. వెండర్లు స్టాంపులను అధిక ధరలకు విక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు. నివాస గృహాలు ఉన్న ప్రాంతాలను వాణిజ్య కేటగిరీలోకి మార్చి రిజిస్టర్లు చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగిన ఒక శాతం అవినీతిపై ఉన్నత స్థాయి అధికారులు విచారణలో తేలిన వాస్తవాలు, ప్రయివేటు వ్యక్తులు ఒక శాతం దందా, అధిక శాతం రైటర్ల వసూళ్లు, అధిక ధరలకు స్టాంపుల విక్రయాలపై విచారణ చేశామని రమణమూర్తి పేర్కొన్నారు. ఈ సమస్యలు పునరావతం కాకుండా చూసుకుంటామని తెలిపారు. రైటర్లపై ఉపయోగపడకుండా పత్రాలు పరిశీలించుకుని చెక్ బందులు రాసుకొని సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో వ్యాల్యూ వేపించుకొని రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకొని ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ అవుతుందని ఈ విషయాన్ని ప్రజలందరూ గుర్తించి అదనపు డబ్బులు ఖర్చు చేసుకోకూడదని పేర్కొన్నారు.

స్కౌట్ విద్యార్థులను అభినందించిన మంత్రి, డిఇఒ


ప్రజాశక్తి - రాయచోటి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో గత నెల 22 నుండి 29 వరకు నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జాతీయ జంబోరీలో పాల్గొని ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లు, విద్యార్థులను గురువారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డిఇఒ సుబ్రహ్మణ్యం అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ జాతీయ జంబోరీలో నేపాల్, శ్రీలంక, సౌదీ అరేబియా దేశాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు 35 వేల మంది పాల్గొనగా, జిల్లా నుంచి 62 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా కంటిన్జెంట్ లీడర్‌గా గుర్రంకొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గురునాథరెడ్డి వ్యవహరించారన్నారు. జంబోరీలో నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, బ్యాండ్, క్యాంప్ ఫైర్, క్యాంప్ క్రాఫ్ట్, స్టేట్ గేట్, టెంట్ ఏర్పాటు, పైనీరింగ్, రంగోలి తదితర విభాగాల్లో జిల్లా విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. జంబోరీ ముగింపు కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఆశీర్వదించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జాతీయ స్థాయి శిబిరంలో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, సేవాభావం, స్వయంకృషి, బృందస్ఫూర్తి వంటి విలువలను ప్రత్యక్షంగా నేర్చుకున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో కలసి మెలసి, వారి సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, జీవన విధానాలను తెలుసుకుంటూ సాంస్కృతిక మార్పిడిని ఆస్వాదించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్స్ నితిన్‌రెడ్డి, ప్రేమ సాగర్, చినబాబు, ఖాదర్‌బాషా, గైడ్ కెప్టెన్లు నిర్మల, లక్ష్మి, తిరుమల దేవి, రేష్మ, వివిధ పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికే కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి (డిసిఇబి) కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పీలేరు మండలం, జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటిపర్తి గంగాధరం గురువారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలికిరి మండలం, నగిరిపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువులు సమాజ నిర్మాణంలో కీలకమైన మూల స్తంభాలని, విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి వంటి బాధ్యతాయుతమైన పదవిలో నియమితులవడం గంగాధరంకు గౌరవం మాత్రమే కాదని, మరింత సమర్థతతో పనిచేయాల్సిన బాధ్యత కూడా ఉంటుందని, ఈ కొత్త బాధ్యతలు జిల్లా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. అనంతరం డిసిఈబి నూతన కార్యదర్శి తాటిపర్తి గంగాధరం మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక నియామకం కోసం సహకరించిన ఎమ్మెల్యేకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యారంగంలో పారదర్శకత, నిబద్ధత, బాధ్యతాయుతమైన విధానాలతో ముందుకు సాగేందుకు తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కోశాధికారి వై.వి.రమణ, ప్రధానోపాధ్యాయులు బి.వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డప్ప, జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోధన సిబ్బంది రామ్మూర్తి, అశోక్ కుమార్, సురేంద్రనాథ్, ఫారుఖ్, ఆనందరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దిత్వా తుపాన్ ప్రభావం..పొంగిన వాగులు వంకలు



చిట్వేలి-రాపూర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

- స్తంభించిన రాకపోకలు
- రోడ్లన్నీ జలమయం
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు
- వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి -చిట్వేలి

తుపాన్ కారణంగా బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని అనుంపల్లి సమీపంలో గల లోలెవెల్ బ్రిడ్జిపై రాజుకుంటచెరువు అలుగు పారడంతో చిట్వేలి- రాపూర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లో లెవెల్ బ్రిడ్జి పై నీరు ప్రవహిస్తున్న ప్రదేశాన్ని సబ్‌కలెక్టర్ భావన, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథహెడ్డే పరిశీలించారు. పోలీసు, రెవెన్యూ శాఖను అప్రమత్తం చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంజున నది, అలిగేరు సమీపాన లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉన్న వారిని అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. అనంతరం జిల్లాలోని అతిపెద్ద రెండవ చెరువు అయిన ఎల్లమ్మ రాజు చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ యంగయ్య, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **రాజంపేట :** దిత్వా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఊటు కూరు నుంచి కొండ్లోపల్లికి వెళ్లే రహదారిలో గల ఎగువ నుంచి నీరు ప్రవహిస్తుండడంతో తహశీల్దార్ పీర్మున్ని ఆదేశా నుసారం ఊటుకూరు విఆర్ఒ శివరాజ్ ఎనర్జీ అసిస్టెంట్ అచ్యుత సాయితో కలిసి గురువారం ఊటుకూరు-కొండ్లోపల్లె మార్గాన్ని మూసివేశారు. వరద ఉధృతి పెరుగు తున్న కారణంగా ఈ మార్గం గుండా ఎవరూ ప్రయాణిం చకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరు : మండలంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమైంది. బుధవారం ఉదయం 11గంటల నుంచి ఎడతెరిపిలేని భారీ వర్షం పడడంతో రంగనాయకులపేట, రాంనగర్ దళితవాడ, తదితర ప్రాంతాలలోని వర్షపు నీరు వెళ్లే మార్గం లేక ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోంది. ఈ దారిగుండా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, రోడ్డు ప్రక్కన చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహిళలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని అధికారులు కానీ, ప్రజాప్రతినిధులుగానీ ఈ సమస్య గురించి పట్టించు కోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



రైల్వేకోడూరులో జలమయమైన ప్రధాన రహదారి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

టిడిపిపై నిందలు వేయడం తగదు

ప్రజాశక్తి-రామాపురం

వైసిపి నాయకుడు విజయభాస్కర్‌పై ఎవరో దాడి చేస్తే ఆ దాడి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులే చేశారని వైసిపి నాయకులు నిందలు వేయడం తగదని టిడిపి మండల అధ్యక్షుడు గాలివీడు వద్దిరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం రామాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకుల్లో వారి మధ్య వారికే సరి పోదని, కింది స్థాయి నాయకులు ఎదుగు తారేమోనని భయంతో దాడులు చేయించడం వారికే అలవాటన్నారు. జిల్లా కేంద్రంగా రాయచోటిని నిలుపుకున్న సందర్భంగా విజయోత్సవ సంబరాల్లో ఉన్న ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వైసిపి నాయకులు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల క్లస్టర్ మాజీ ఇన్‌ఛార్జి రామకృష్ణ గౌడ్ యువ నాయకులు దేవదర్శన్‌రెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పొమ్మల రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లి టౌన్

కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పడిన సందర్భంగా మదనపల్లె ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ పెన్షనర్ల సంఘ సభ్యులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు అందరూ ఏకతాటిపై వచ్చి కొత్త ఏర్పడిన మదనపల్లె జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముం దుకు తీసుకెళ్లేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు రెడ్డి శేఖర్, కార్యదర్శి శివప్రసాద్, గౌరవ అధ్యక్షులు నరసింహారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం దృష్టికి మార్కెట్ యార్డు సమస్యలు

ప్రజాశక్తి-మదనపల్లి టౌన్



పవన్‌కల్యాణ్‌తో మాట్లాడుతున్న శివరామ్

మదనపల్లి మార్కెట్ యార్డు సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు మదనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు. గురువారం చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చిన పవన్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. మదనపల్లి మార్కెట్ యార్డ్‌లో ఉన్న సమస్యలను, రైతుల సమ స్యలను వివరించి పరిష్కా రాలకు సంబంధించిన రిప్రజెంటేషన్‌ను అందించినట్లు తెలిపారు. రైతులకు మేలు జరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ సమగ్ర నివేదికను అందించామని తెలిపారు. స్పందించిన డిప్యూటీ సిఎం మదనపల్లె మార్కెట్ యార్డ్ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని, త్వరితగతిన అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పిటిఎం ఎస్ఐగా పరమేశ్వర్ నాయక్

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం ఎస్ఐగా పరమేశ్వర్‌నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హరిహరప్రసాద్ అన్నమయ్య జిల్లా కేంద్రానికి బదిలీ కావడం విఆర్‌లో ఉన్న పరమేశ్వర్ నాయక్‌ను ఉన్నతాధికారులు పిటిఎంకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలందరికీ పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రోగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - వాల్మీకిపురం

పట్టణంలోని 50 పడకల ప్రభుత్వాసుపత్రిలో గురువారం శ్రీసత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు దుప్పట్లను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆసుపత్రిలో రోగులు చలికాలంలో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మాలతి, డాక్టర్ సోనీ, సిబ్బంది సుధాకర్, వైసిపి నాయకులు చింతల ఆనంద్ రెడ్డి, మదన మోహన్ రెడ్డి, నీళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -వాల్మీకిపురం

ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కూరపర్తిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఆరమడకకు చెందిన శ్రీనాథ్(38) సొంత గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో వేగంగా వెళుతూ కూరపర్తి వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనాథ్‌ను గ్రామస్తులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనాథ్ మృతి చెందాడు. ప్రమాదవశాత్తు జరిగే సంఘటనలు, పురుగుమందులు తదితర కేసులు ప్రభుత్వాసుపత్రికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడం గమనార్హం.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే



పిల్లలకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోళ్ళబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలో వెలుగు సంస్థ ప్రత్యేక పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. చిన్నారులు పుష్పగుచ్చాలతో ఆయనకు స్వాగతం పలికారు. సంస్థ ప్రిన్సిపల్ లీనాకుమారి మాట్లాడుతూ వెలుగు కార్యకలాపాలను వివరించారు. వెలుగు సంస్థకు రాకపోకలు ఇబ్బందిగా మారుతున్నందున రహదారి అభివృద్ధి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. వృద్ధాశ్రమం సోషల్ వర్కర్ గీత మాట్లాడుతూ ప్రస్తుతం వెలుగు వృద్ధాశ్రమం సేవలు పెరుగుతున్నాయని, ఆశ్రయం కోసం మరెందరో వృద్ధులు వస్తున్నారని తెలిపారు. స్థలం లేక చేరదీయలేని పరిస్థితి ఉన్నందున, రేకుల రూమ్ పై స్లాబ్ వేసి విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా వెలుగు సంస్థలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి సేవాభావాన్ని కొనియాడారు. బధిర చిన్నారులకు హియరింగ్ ఎయిడ్స్, శారీరక వైకల్యం ఉన్న చిన్నారులకు వీల్‌చైర్లను అందించారు. వివిధ ఆటల పోటీల్లో విజయం సాధించిన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఎంసి పాలక వర్గ సభ్యులు డాన్స్ రెడ్డెప్ప, ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి, వృద్ధాశ్రమం సుపరింటెండెంట్ ఎం. ఉదయ్ కుమార్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఇసి మెంబర్ సుజాత, వార్డెన్ స్వీటీ, సోషల్ వర్కర్ గీత, వెలుగు చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :** భవిత కేంద్ర సేవలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ రాజగోపాల్ తెలిపారు. పట్టణంలో జడ్‌పిహెచ్‌ఎస్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రాజగోపాల్, జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భారతి, భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డమ్మ, ఫిజియోథెరపిస్ట్ షాహిన్ తాజ్, రెడ్డిరాణి, స్కూల్ అసిస్టెంట్ రామచంద్ర, జిల్లా వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మౌలాలి, గొంగడి కృష్ణమూర్తి, రఘు, చంద్ర, అంద ఉపాధ్యాయులు గురు ప్రసాద్, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది గిరిబాబు, దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ భవిత కేంద్రంలో దివ్యంగ పిల్లలకు ఎన్నో రకాలు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఉచిత యూనిఫామ్స్, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. అంతేకాకుండా విభిన్న ప్రతిభావంతులకు ఉచిత పరికరాలు, ప్రయాణ బత్యం నెలకు రూ.600, ఎస్కార్ట్ అలెవెన్స్ రూ. 300, బాలికలకు ప్రత్యేక అలెవెన్స్ రూ.300, శనివారం ఇంటివద్దనే సహిత ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ ఇచ్చి, నెలకు రూ.300 చొప్పున అందిస్తున్నారని తెలిపారు. **ములకలచెరువు:** మండలంలోని స్థానిక భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ వికలాం గుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ఎంఇఒ వెంకటరమణ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందించారు.కార్యక్రమంలో ఉపాధ్యా యురాలు నీరజ, కళావతి విద్యార్థులు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి :** సాదించాలన్న సంకల్పం ముందు వైకల్యం చిన్నబోతుందని వైకల్యం అనేది శరీరానికే తప్ప మనసుకు కాదని తంబళ్లపల్లె సివిల్ కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి న్యాయా ధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయ అధికారి మాట్లాడుతూ మనోధై ర్యంతో ఆంగవైకల్యాన్ని ఎదుర్కొని ఉన్నత శిఖరాలను అందుకున్న గొప్ప వారెందరో ఉన్నారని వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాల న్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులచే కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. పిల్లలకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం సాంబశివ, శ్రీనివాసులు, రీసోర్స్ టీచర్లు రేఖ, శ్రావణి, ఫిజియో థెరపిస్టు లు, సరళకు మారి, కేర్గివర్, గంగరత్నమ్మ, సిఆర్‌పి సుధాకర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తంబళ్లపల్లి : మాట్లాడుతున్న జడ్జిఉమర్ ఫరూక్



మాట్లాడుతున్న ఫెమి9 ఎడ్యుకేటర్ అనంత్

'మిట్స్'లో మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్‌టు బి యూనివర్సిటీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ వారి ఆధ్వర్యంలో తమిళనాడుకు చెందిన స్త్రీ సాధికారికత ఫెమీ-9 సంస్థ ప్రతినిధులు మహిళల ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత శుభ్రత అనే అంశంపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విసి యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధు లుగా కుప్పంకు చెందిన ఫెమి9-హైజీన్ ఎడ్యుకేటర్స్ అనంత్, జయశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుతుక్రమంలో హైజీనిక్ పద్ధతులు, సురక్షిత శానిటరీ ఉత్పత్తుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిం చారు. మహిళలు, ముఖ్యంగా గ్రామీణ వెనుకబడిన వర్గాల్లో ఉన్నవారు, శుభ్రమైన, గౌరవప్రదమైన విధంగా రుతుక్రమం నిర్వహించుకోవడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రపంచ, దేశ స్థాయి గణాంకాలు ప్రదర్శిస్తూ రుతస్రావంపై ఉన్న అపోహలు, అవగాహన లోపం కారణంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. దేశంలో మహిళల కేన్సర్ కేసుల్లో పెరుగుదల ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. షణ్ముగ ప్రియా మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి యువతికి అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వి. గీతాదేవి, కె.కవిత, ఎంబిఎ, ఎంసిఎ మొదటి సంవత్సరం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు హల్‌చల్

ప్రజాశక్తి - వాల్మీకిపురం



ట్రాన్స్‌ఫార్మర్‌పై కూర్చున్న నాగార్జున

మద్యం మత్తులో ఓ యువకుడు విద్యుత్ స్తంభంపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై కూర్చుని హల్ చల్ చేసిన సంఘటన మండలంలోని తాటిగుంటపల్లె పంచాయతీ గజ్జలవారిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. గజ్జలవారిపల్లెలో గురువారం విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధి దీపాలను మార్చేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు. అక్కడే మద్యం మత్తులో ఉన్న నాగార్జున వీధిలైట్లకు సంబంధించిన మెటీరియల్స్‌ను తీసుకున్నాడని గ్రామస్తులు చెప్పడంతో పంచాయతీ కార్యదర్శి పంచాయతీ కార్యదర్శి మెటీరియల్స్ ఇవ్వాలని కోరాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న నాగార్జున నన్నే మెటీరియల్స్ అడుగుతావా అంటూ పంచాయతీ కార్యదర్శిని బెదిరించి, దుర్భాషలాడు. అంతేకాకుండా పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై ఉన్న ట్రాన్స్ఫార్మర్ పై కూర్చుని బిగ్గరగా కేకలు వేశాడు. గమనించిన గ్రామస్తులు నాగార్జునను కిందకు దిగమని చెప్పినా అతను వినకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యుత్ స్తంభంపై ఉన్న నాగార్జునను కిందకు దింపి స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు

జిల్లా కేంద్రం చేయాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ గురువారం డిఎల్‌పిఒ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రాజంపేటకు వచ్చిన కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్‌రాజు, టిడిపి మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్‌నాయుడు, టిడిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు పోలి శివకుమార్, జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.
కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జగన్‌మోహన్‌రాజు



హారికారెడ్డితో కరస్పాండెంట్ శివప్రసాద్, ఉపాధ్యాయులు

భగవద్గీత పోటీలో విజేతగా హారికారెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

శివ దర్శనానంద స్పిర్చువల్ ట్రస్ట్ ప్రొద్దుటూరు నిర్వహించిన రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలో శ్రీ అన్నమాచార్య అకాడమీకి చెందిన విద్యార్థిని ఒ.హారికా రెడ్డి జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాం డెంట్ సమ్మెట శివప్రసాద్ తెలిపారు. ఈ పోటీలో దాదాపు 150మంది విద్యార్థులు పాల్గొనగా హారికారెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచిందన్నారు. కార్యక్ర మంలో డైరెక్టర్లు మాడపూరి హేమలత, బాల ఆంజనేయులు, సమ్మెట ఉమామహేశ్వరరావు,రిటైర్డ్ ఎల్ఐసి ఎఒ సుబ్బరాయుడు, ఉపాధ్యాయురాలు లలిత , అధ్యాపక బృందం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-కలికిరి



వీరభద్రయ్య, మునికుమార్ (ఫైల్ ఫొటో)

కలికిరి రైల్వేస్టేషన్‌కు సమీపంలో పట్టాలపై కూర్చొని మద్యం సేవి స్తుం డగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. కదిరి రైల్వే హెడ్ కానిస్టే బుల్ భాషా కథనం మేరకు..చిత్తూరు జిల్లా, సోమల మండలం, ఇరికి పెంటకు చెందిన గంధం మునికుమార్(40), కలికిరి మండలం, గుట్టపాలెం పంచాయతీ, ఆచార్యుల కొత్తపల్లికి చెందిన జి.వీరభద్రయ్య(48) కలికిరి క్రాస్‌లో స్థిరపడ్డారు. మృతులు ఇద్దరు కలిసి బుధవారం రాత్రి కలికిరి రైల్వే స్టేషన్‌లో మద్యం సేవిం చడానికి వెళ్లగా రైల్వే సిబ్బంది ఇక్కడ తాగరాదని పంపించడంతో వారితో గొడవ పడ్డారని తెలిపారు. రైల్వే అధికారులు మందలించడంతో సమీపంలోని పట్టాలపైకి వెళ్లి కూర్చుని మద్యం తాగుతుండగా అదే సమయంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఇద్దరూ మృతి చెందినట్లు తెలిపారు. విష యం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని మృతదేహాలపై పడి కన్నీటి పర్యంతమయ్యారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నందలూరు పంచాయతీలో ఉన్న శివసాయి వైన్‌షాప్ దగ్గర టివిపురం గ్రామానికి చెందిన చెందిన ఎర్రగుళ్ల రోశయ్య (65)అనే వృద్ధుడు మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలవలో పడి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనస్థలి వద్దకు చేరుకొని మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

బోరు కేబుల్ వైరు చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ములకలచెరువు : పిటిఎం మండలంలోని కందుకూరులో బోరు మోటార్ల మరమ్మతులు చేసే ఆనంద్ అంగడిలో రెండు బోరుమోటార్లు చోరీకి గురెనట్లు బాధితుడు తెలిపారు. మరమ్మతులకు తెచ్చినమోటార్లు అంగడిలో ఉంచి ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు తలపులు బద్దలుకొట్టి మోటార్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. దూలంవారి పల్లెకు చెందిన ఎనిమిది మంది రైతులకు చెందిన వ్యవసాయబోర్ల వద్ద కేబుల్ వైరు చోరీ కి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కాలువలో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.

బంగారు నగలు, నగదు చోరీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



చెల్లాచెదురైన బీరువా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : ఇంటిలోకి చొరబడి బంగారు నగలను, నగదును గుర్తుతెలి యని వ్యక్తులు చోరీ చేసిన సంఘటనపై బాధితులు నిమ్మనపల్లి పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ రవినాయక్, స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల వివరాల మేరకు.. నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ రాచవేటివారిపల్లెలో మంచూరి వేణుగో పాల్‌రెడ్డి తన భార్య కళావతి, కుమార్తెలతో కలసి నివాసముంటున్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి పెద్ద కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోందని, చిన్న కుమార్తె ఇంటి వద్దనే ఉంటున్నాదన్నారు. వీరికి గ్రామంలోనే ఎదురెదురుగా రెండు ఇళ్లుఉండగా, బుధవారం రాత్రి ఒక ఇంటిలో వేణుగోపాల్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి నిద్రపోయారన్నారు. గురువారం ఉదయం నిద్రలేచి వీరికి ఎదురుగా ఉన్న ఇంటి వద్ద పశువుల వద్ద పాలు పిండడానికి వెళ్లారన్నారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగలగొట్టి ఉండడాన్ని గమనించి, ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాను తెరిచి ఉండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బీరువా బీగాలను పెట్రోల్ పోసి కాల్చి పగలగొట్టి, బీరువాలోని బంగారు నగలను, నగదును దొంగలించికెళ్లినట్లు పేర్కొన్నారు. చోరీ జరిగిన సమాచారం తెలియడంతో పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టామన్నారు. బాధ్యతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.